ఇక జోర్డాన్ నదిని దాటి కాన్యన్ ప్రాంతంలోని ఇజ్రాయేల్‌లోకి వెళ్లడం తరువాయి. భగవంతుని ఆదేశం మేరకు మోజెస్ అందరికీ చెప్పాడు – "మీరు అక్కడకి వెళ్లగానే అక్కడున్నవాళ్ల నందరినీ తరిమేయాలి. వాళ్ల విగ్రహాలు ధ్వంసం చేయాలి. శత్రుశేషం వుంచితే తర్వాత వాళ్లు పక్కలో బల్లెంలా తయారవుతారు. తర్వాత ఆ భూమిని మీలో మీరు జనాభా నిష్పత్తిలో పంచుకోవాలి. ఒక తెగలోని స్త్రీలు ఆ తెగలోని వారినే పెళ్లాడాలి. లేకపోతే మరొక తెగకు జనాభా ఎక్కువై వారికి ఎక్కువ భూమి దఖలు పడుతుంది. పూజారులైన లేవీయులకు ఆరు నగరాలు కేటాయించండి. ఎవరైనా పొరబాటున మరొక మనిషిని చంపినపుడు, చనిపోయిన వారి బంధువుల నుండి పారిపోయి శరణు పొందడానికి యీ నగరాలు పనికి వస్తాయి. అలా పారిపోయిన వ్యక్తి ప్రధానపూజారి మరణించిన తర్వాతనే మళ్లీ తన ప్రాంతానికి తిరిగిరావాలి."

దీని తర్వాత మోజెస్ ఈజిప్టులో బానిస బతుకు నుండి తాము ఎలా విముక్తి చెందామో, గత నలభై ఏళ్లగా సాగిస్తున్న ప్రయాణంలో ఎటువంటి కష్టాలను ఎదుర్కున్నామో, దేవుడు అడుగడుగునా ఎలా కాపాడాడో, దానికి గాను ఎలాటి నియమాలను విధించాడో తన సాటి హీబ్రూలకు గుర్తు చేస్తూ ఉపన్యాసాలుగా చెప్పాడు. ఈ ఉపన్యాసాలతో కూర్చిన భాగాన్ని డ్యూటెరొనమీ అన్నారు. గ్రీక్‌లో డ్యూటెరొ.. అంటే రెండవ.. అందుకని తెలుగులో ద్వితీయ ఉపదేశకాండం అన్నారు. ఇది చెప్పిన తర్వాత మోజెస్ నెబో పర్వతంపైకి వెళ్లాడు. అక్కణ్నుంచి దేవుడు తాను మాటిచ్చిన పుణ్యభూమి ఎలా వుంటుందో చూపించాడు. తర్వాత మోజెస్ మరణించాడు. దేవుడు అతన్ని ఒక లోయలో కప్పిపెట్టాడు. ఆ స్థలం ఎక్కడుందో ఎవరికీ తెలియదు. 120 ఏళ్ల పాటు జీవించిన మోజెస్ చివరివరకు దృఢంగానే వున్నాడు. అటువంటి ప్రవక్త మరొకరు కానరారు.

మోజెస్ (మోషే అని కూడా అంటారు) తర్వాత అతని వారసుడిగా వచ్చిన జోషువా (యెహోషువ అని కూడా అంటారు) పేరుమీదుగా తర్వాతి అధ్యాయం వుంది. జోర్డాన్ నదిని దాటి వెళ్లి కానన్ ప్రాంతంలోని జెరికో రాజ్యాన్ని వశపరుచుకోవడం, యుద్ధాలు చేయడం – యివన్నీ వస్తాయి. జోషువా జెరికో రాజ్యానికి యిద్దరు గూఢచారులను పంపించాడు. ఆనుపానులు తెలుసుకుని రమ్మనమన్నాడు. వాళ్లు రాహాబ్ అనే వేశ్య యింటికి వెళ్లారు. వాళ్లు అలా వెళ్లిన సంగతి పసిగట్టిన రాజు ఆమెకు కబురంపాడు – వాళ్లెక్కడున్నారో చెప్పమని. "ఎవరో వచ్చినమాట నిజమే కానీ వాళ్లు ఏ దేశస్తులో నేనెరుగను. పొద్దు గూకేలోగా, నగరద్వారాలు మూసేలోగా వాళ్లు మళ్లీ తిరిగి వెళ్లిపోయారు. మీ వాళ్లు వెంటాడితే దొరకవచ్చు అంది. రాజు సైనికులు నగరం బయట వెతకసాగారు.

నిజానికి వేశ్య వాళ్లను తమ అటకమీద దాచింది. సైనికులు వెళ్లిపోయాక గూఢచారుల వద్దకు వెళ్లి "దేవుడు యీ దేశాన్ని మీకిచ్చాడని, ఈజిప్టునుండి మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుతూ ఎన్నో మహిమలు చూపించాడని, అతని అనుగ్రహంతో మీరు మా దేశంపై పడి తరిమివేస్తారనీ విని యీ దేశప్రజలందరం విని భయపడుతున్నాం. అలా దాడి జరిగే పక్షంలో నాకు, నాకు నా కుటుంబానికి హాని చేయనని మీరు నాకు మాట యివ్వండి." అని కోరింది. అలాగే రక్షిస్తాం అన్నారు వారు. "అయితే మీరు యిక్కణ్నుంచి పర్వతప్రాంతానికి వెళ్లి మూడు రోజులు దాక్కోండి. సైనికులు తిరిగి వచ్చేశాక మీరు సురక్షితంగా వెళ్లిపోవచ్చు." అని తన యింటి కిటికీలోంచి ఓ తాడుతో వాళ్లను కిందకు దింపింది. వాళ్లు ఆమెకు ధన్యవాదాలు తెలుపుతూ "ఈ కిటికీకి నువ్వు ఒక ఎఱ్ఱదారం కట్టి వుంచు. మా వాళ్లు దాడి చేసినపుడు దాన్ని చూసి గుర్తు పట్టి మీ యింటి జోలికి రారు." అని చెప్పారు. ఆమె వెంటనే కిటికీకి ఎఱ్ఱదారం కట్టింది.



గూఢచారులు వెనక్కి తిరిగి వెళ్లి జోషువాకు తాము చూసిన విశేషాలు చెప్పాక అతను జోర్డాను నది దాటి దాడి చేయాలని నిర్ణయించాడు. దేవుడి ఆదేశం మేరకు దేవుడి గుడిలో దశాదేశాలు భద్రపరచిన పెట్టెని పూజారులు మోసుకుంటూ బయలుదేరారు. దానికి ఒక కిలోమీటరు దూరంలో వుంటూ తక్కినవారు అనుసరించారు. ఆ పూజారులు ఆ పెట్టె మోస్తూ జోర్డాను నదిలో ప్రవేశించగానే ఆ నదీప్రవాహం ఆగిపోయింది. ఎగువనే నిలిచిపోయింది. అప్పుడు హీబ్రూలు నదీగర్భం గుండా ఏరు దాటారు. పూజారులు ఆ నది మధ్యలోనే ఆ పెట్టె పట్టుకుని నిలబడ్డారు. అందరూ నది దాటాక అప్పుడు పైకి వచ్చారు. దేవుడు జోషువాకు చెప్పాడు – "మీలో పన్నెండు తెగలున్నాయి కదా. ఒక్కో తెగ నుండి ఒక్కొక్క నాయకుణ్ని ఎంపిక చేసి ఆ నదీగర్భం నుండి ఒక్కొక్క రాయి భుజాన పెట్టుకుని తీసుకుని రమ్మనమను. అంతేకాదు, నువ్వు పన్నెండు రాళ్లను బయటనుండి తీసుకుని వెళ్లి ఆ పూజారులు నిలబడిన చోట పాతు. ఆ రాళ్లు భావితరాల వారికి మీరు జోర్డాన్ నది దాటిన వైనం, మిమ్మల్ని దాటించిన దేవుని ప్రజ్ఞ తెలియచెప్తాయి." అని. అందరూ అలాగే చేశారు. ఆ తర్వాత నది ఎప్పటిలాగ ప్రవహించింది.

జెరికో రాజ్యానికి తూర్పున వున్న గిల్గాలు చేరిన తర్వాత జోర్డాను నదినుండి తెచ్చిన పన్నెండు రాళ్లను అక్కడ పాతించాడు

జోషువా. ఈజిప్టు వదిలిన తర్వాత పుట్టిన హీబ్రూ బాలలకు సున్తీ శుద్ధి చేయించలేదు. అందువలన దేవుడు వాళ్లకు సున్తీ చేయమని జోషువాను ఆదేశించాడు. రాతికత్తులు తయారుచేయించి జోషువా ఆ పని పూర్తి చేయించాడు. ఆ తర్వాత పాస్క పండుగను ఆచరించారు. ఆ మర్నాడు ఆ దేశంలో పండిన ధాన్యంతో రొట్టె చేసుకుని తిన్నారు. అప్పటినుండే ఆకాశంనుండి కురిసే మన్నా ఆగిపోయింది. జోషువా ఒక రోజు ఒక కృపాణధారిని చూసి ఎవరు నీవు? అని అడిగాడు. నేను దైవసైన్యానికి సేనానిని అని అతను చెప్పగానే అతనిముందు సాగిలబడ్డాడు. "నువ్వు నిలబడిన భూమి పుణ్యభూమి. చెప్పులు యిప్పివేయి" అన్నాడతను. ఇక యిప్పటినుండి హీబ్రూలు తమ పుణ్యభూమియైన ఇజ్రాయేలును వశపరచుకునే కథ నడుస్తుంది. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**